# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

epaper:vishalabharati.com

మంగళవారం, హైదరాబాద్ 25.03.2025 | 24 క్యారెట్లు 87,215.00 | కిలో వెండి 1,07,748.00 | 33 ℃ | సంపుటి:3 | సంచిక:154

www.vishalabharati.com




## అశుతోష్ దెబ్బ అదుర్స్..

- అసాధారణ ఇన్నింగ్స్ 31 బంతుల్లో 66 పరుగులు
- ఓడిపోయే మ్యాచ్ లో గెలుపు
- తొలి విజయాన్ని నమోదు చేసిన ఢిల్లీ క్యాపిటల్స్

విశాలభారతి, స్పోర్ట్స్ బ్యూరో:

ఐపీఎల్ సీజన్ 18 లో ఢిల్లీ క్యాపిటల్స్ తొలి విజయాన్ని అందుకుంది. అశుతోష్ శర్మ(66, 31 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్సర్లు) వీరోచిత ఇన్నింగ్స్ తో లక్నో సూపర్ జయింట్స్ తో చివరి వరకు హోరాహోరీగా జరిగిన ఈ మ్యాచ్ లో ఒక వికెట్ తేడాతో నెగ్గి ఊపిరి పీల్చుకుంది. వైజాగ్ వేదికగా అత్యంత ఉత్కంఠ భరితంగా జరిగిన ఈ మ్యాచ్ లో చివరో వరకు విజయం ఇరు జట్లతో దోబూచులాడింది. చివరి ఓవర్లో అశుతోష్ శర్మ సిక్సర్ కొట్టి ఢిల్లీకి థ్రిల్లింగ్ విక్టరీ అందించాడు. మొదట బ్యాటింగ్ చేసిన లక్నో సూపర్ జయింట్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 209 పరుగులు చేసింది. లక్ష్య ఛేదనలో ఢిల్లీ క్యాపిటల్స్ 20 ఓవర్లలో 9 వికెట్లను 211 పరుగులు చేసి గెలిచింది. 210 పరుగులు

..మిగతా 2 లో



## డెడ్‌బాడీల వెలికితీత స్పీడప్

- ఎస్ఎల్‌బీసీ సొరంగంలో సహాయక చర్యలు వేగవంతం చేయాలి
- అధికారులకు సీఎం రేవంత్ ఆదేశాలు

..మిగతా 2 లో

# ఆ నలుగురు ఎవరు..?

## మంత్రివర్గ విస్తరణకు వేళాయె



- ఉగాదికి ముహూర్తం ఖరారు.. కాంగ్రెస్ హైకమాండ్ గ్రీన్ సిగ్నల్
- అధిష్టానం పెద్దలతో సీఎం రేవంత్, భట్టి, ఉత్తమ్, మహేశ్ కుమార్‌గౌడ్ భేటీ
- మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్ పోస్టులపై డిస్కషన్
- శ్రీహరి ముదిరాజ్, రాజగోపాల్‌రెడ్డి, వివేక్, సుదర్శన్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్ల పరిశీలన
- మంత్రి పదవి దక్కని వారికి డిప్యూటీ స్పీకర్, చీఫ్ విప్‌గా అవకాశం
- ఆరు పదవులను భర్తీ చేస్తే ఎస్టీ, మైనార్టీలకు చోటు

*తెలంగాణలో రాజకీయాలు రోజురోజుకు రసవత్తరంగా మారుతున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు పూర్తవుతున్న నేపథ్యంలో ఎప్పుడెప్పుడు మంత్రివర్గ విస్తరణ జరుగుతుందని ఆశావాహులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆసక్తికరంగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే చాలాసార్లు ఢిల్లీకి వెళ్లి హైకమాండ్‌ను కలిసిన సీఎం రేవంత్ రెడ్డి మాత్రం.. మంత్రివర్గ విస్తరణ గురించి అసలు ఎలాంటి చర్చ జరగలేదంటూ ప్రతిసారి దాటేస్తూనే ఉన్నారు. కానీ.. ఆయన వెళ్లిన ప్రతిసారీ.. కేబినెట్ విస్తరణ అంశం మీద రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతూనే ఉంది. కాగా.. ఈరోజు (మార్చి 24న) సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లటంతో.. మంత్రివర్గ విస్తరణ అంశం మరోసారి తెరపైకి వచ్చింది.*

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

సోమవారం (మార్చి 24న) ఢిల్లీ పర్యటనలో భాగంగా.. సీఎం రేవంత్ రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా ఉన్నారు. మధ్యాహ్నం శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి బయలుదేరి వెళ్లిన నేతలు.. సాయంత్రం 6 గంటలకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో సమావేశమయ్యారు. అయితే.. ఈ సడెన్ టూర్ కేబినెట్ విస్తరణ గురించే అంటూ కాంగ్రెస్ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. గతకొన్ని రోజులుగా కేబినెట్ విస్తరణ అంశంపై కాంగ్రెస్ అధిష్ఠానం పలు దఫాలుగా చర్చలు జరుపుతూనే ఉంది. కొత్తగా వచ్చిన తెలంగాణ కాంగ్రెస్ ఇంఛార్జీ మీనాక్షీ నటరాజన్ కూడా రాష్ట్రంలోని కీలక నేతలతో వ్యక్తిగతంగా భేటీ అవుతూ.. పరిస్థితులపై ఆరా తీశారు. దీంతో.. మంత్రివర్గ విస్తరణ విషయంలో అధిష్ఠానం ఓ నిర్ణయానికి వచ్చిందని చర్చించుకుంటున్నారు. అయితే.. ప్రస్తుతం రాష్ట్రంలో 6 మంత్రి పోస్టులు ఖాళీగా

..మిగతా 2 లో

# త్వరలో భూముల ధరల పెంపు

- భూభారతి అమల్లోకి వచ్చాక నిర్ణయం
- వేగంగా ఎల్ఆర్ఎస్ ప్రక్రియ
- ఈ నెల 31లోపు చెల్లిస్తే 25 శాతం రాయితీ
- రాష్ట్రవ్యాప్తంగా ఆరువేల మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లు
- ఇంటర్ విద్యార్హతతో వీఆర్ఏ, వీఆర్వోలకు జీపీవోలుగా అవకాశం
- మీడియాతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



విశాలభారతి, స్టేట్ బ్యూరో:

అనుమతి లేని లేఅవుట్ల క్రమబద్ధీకరణ వేగంగా జరుగుతోందని, ఈ నెల 31వ తేదీలోపు రుసుం చెల్లించేవారికి 25 శాతం రాయితీని అమలు చేస్తున్నట్లు రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇప్పుడు కాకుండా.. ఇంటి నిర్మాణం సమయంలో ఎల్ఆర్ఎస్ తీసుకోవాలంటే 100 శాతం చెల్లించాల్సి ఉంటుందనే విషయాన్ని భూయజమానులు గుర్తించాలని సూచించారు. సోమవారం శాసనసభలోని తన ఛాంబర్‌లో పొంగులేటి మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. పాత్రికేయులు అడిగిన ప్రశ్నలకు జవాబులిచ్చారు. "ఎల్ఆర్ఎస్ పూర్తి చేయకుండా గత ప్రభుత్వం పక్కనపెట్టింది. ప్రజాప్రభుత్వం వచ్చాక వాటిని పూర్తి చేయడానికి సంకల్పించింది. రుసుం తీసుకోబోమని మేం ఎక్కడా చెప్పలేదు. లేఅవుట్ల క్రమబద్ధీకరణ చేయించుకుంటే భవిష్యత్‌లో భవన నిర్మాణాలు, రిజిస్ట్రేషన్ల సందర్భంగా సమస్యలుండవు. క్రమబద్ధీకరణ చేయించుకునే వారి నుంచి మంచి స్పందన వస్తోంది. పురపాలకశాఖ ఎల్ఆర్ఎస్

..మిగతా 2 లో



## రిజర్వేషన్లు పెరిగితే ఎస్టీ వర్గీకరణకు యత్నిస్తాం

- సంక్షేమ పథకాల పేటెంట్ కాంగ్రెస్‌దే
- ఏజెన్సీలో ఎస్టీలకే ఉద్యోగాలు దక్కేలా చర్యలు
- శాసనసభలో మంత్రి సీతక్క

..మిగతా 2 లో

# ఎంఎంటీఎస్ రైల్లో రేప్ అటెంప్ట్...

## అల్వాల్ వద్ద మృగాడి ఘాతుకం

- లేడీస్ బోగీలోకి ఎక్కి దుశ్చర్య
- యువతి ఒక్కతే బోగీలో ఉండడంతో బరితెగింపు
- భయంతో రైలు నుంచి దూకిన యువతి
- తీవ్ర గాయాలపాలై అపస్మారక స్థితిలోకి
- బాధితురాలిని యశోధ ఆస్పత్రికి తరలింపు
- కేంద్ర మంత్రి బండి సంజయ్‌కీలక వ్యాఖ్యలు



విశాలభారతి, స్టేట్ బ్యూరో:

ఎంఎంటీఎస్ రైల్లో మహిళపై అత్యాచార యత్నం ఘటన హైదరబాద్ లో సంచలనంగా మారింది. దీనిపై అన్ని పార్టీలు కూడా సీరియస్ గా స్పందించాయి. ఇప్పటికే బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కూడా స్పందించారు. బీఆర్ఎస్ నేతలు ఆస్పత్రికి వెళ్లి మరీ బాధితురాలిని పరామర్శించారు.ఈ క్రమంలో ఎమ్మెల్సీ కవిత.. రైల్వే ఎస్పీ చందనాదీప్తితో సైతం మాట్లాడారు. ఘటనపై వెంటనే లోతుగా విచారణ

..మిగతా 3 లో



## అడ్వొకేట్ దారుణ హత్య

- రోడ్డుపై కత్తితో పొడిచి మర్డర్
- మహిళను వేధించొద్దనడమే రీజన్
- అందరూ చూస్తుండగానే దారుణం

..మిగతా 3 లో

# గ్రూప్ 1 మెయిన్స్‌పై వివాదం

- పరీక్షా పత్రాల కరెక్షన్‌లో లోపాలు
- తెలుగు మీడియం అభ్యర్థులకు అన్యాయం
- రీవాల్యుయేషన్ చేయించాలి
- హైకోర్టులో అభ్యర్థుల పిటిషన్
- ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసిన కోర్టు

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

గ్రూప్1 మళ్లీ రద్దవుతుందా? పరీక్ష రాసి ఫలితాలు వచ్చాయని ఊపిరి పీల్చుకుంటున్న అభ్యర్థులకు షాక్ తగలనుందా? తెలంగాణలోఎప్పటిలాగే గ్రూప్ 1 వ్యవహారం మళ్లీ మొదటికి రానుందా? అంటే జరుగుతున్న పరిణామాలు చూస్తే అవుననే అనిపిస్తున్నాయి. జవాబు పత్రాలు రీ వాల్యూయేషన్ చేయాలని పలువురు గ్రూప్ 1 అభ్యర్థులు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. గ్రూప్1 మెయిన్స్ పరీక్ష పేపర్లను రీవాల్యుయేషన్ జరిపించాని హైకోర్టులో పిటిషన్ వేశారు. గ్రూప్ 1 పేపర్ల వాల్యుయేషన్ లోపభూయిష్టంగా జరిగిందని పిటిషనర్లు తెలిపారు. 18 రకాల సబ్జెక్టులుంటే 12 సబ్జెక్టుల నిపుణులతోనే దిద్దించారన్నారు.



మూడు భాషల్లో పరీక్ష జరిగినా సరైన నిపుణులతో మెయిన్స్ సమాధాన పత్రాలు దిద్దించలేదని పిటిషన్‌లో ఆరోపించారు. ఒకే మాధ్యమంలో నిపుణులైన వారితో రెండు భాషల (తెలుగు, ఇంగ్లీష్) ఆన్సర్ పేపర్లు దిద్దించచారని, దీంతో వాల్యుయేషన్‌లో

..మిగతా 3 లో



## ఆశా వర్కర్ల ఆందోళన ఉద్రిక్తం

- రూ.18వేల వేతనం ఇవ్వాలని డిమాండ్
- కోఠిలోని సీఎఫ్‌డబ్ల్యూ కార్యాలయం ముట్టడికి యత్నం
- అడ్డుకున్న పోలీసులు..వేర్వేరు ఠాణాలకు తరలింపు

..మిగతా 2 లో

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
మంగళవారం
25.03.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



## డెడ్‌బాడీల వెలికితీత స్పీడప్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** ఎస్ఎల్‌బీసీ సొరంగంలో సహాయక చర్యలు వేగవంతం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. సొరంగంలో చిక్కుకున్న కార్మికుల మృతదేహాలను వీలైనంత త్వరగా వెలికితీసేలా చూడాలన్నారు. తాత్కాలిక చర్యలతో పాటు శాశ్వత చర్యలపైనా దృష్టి పెట్టాలని.. తగిన జాగ్రత్తలు తీసుకుంటూ ముందుకెళ్లాలని సీఎం సూచించారు. అవసరమైతే ఎన్‌జీఆర్ఐ, జీఎస్ఐతో అధ్యయనం చేయించాలని అధికారులకు చెప్పారు. సొరంగం నుంచి కార్మికుల మృతదేహాలను వెలికితీసే ప్రక్రియలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం డ్రిల్ అండ్ బ్లాస్ట్ విధానాన్ని ఉపయోగించే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ అంశంలో ఉన్నత స్థాయి కమిటీ సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్లనుంది. కేంద్ర హోంశాఖ మార్గదర్శకాల ప్రకారం.. గల్లంతైన ఏడుగురు బాధితుల కుటుంబాలకు పరిహారం చెల్లించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది.

# ఆ నలుగురు ఎవరు..?

తరువాయిభాగం

ఉండగా..నాలుగు మంత్రి పదవులు భర్తీ చేసే అవకాశమున్నట్లు తెలుస్తోంది. అయితే ఎవరెవరికి అవకాశం ఇవ్వాలన్న విషయంపై కూడా అధిష్ఠానం ఓ నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది. అందుకే సీఎం రేవంత్ రెడ్డి, భట్టి, ఉత్తమ్ హుటాహుటిన ఢిల్లీకి పయనమైనట్టు సమాచారం అందుతోంది.

అయితే.. ఈ నాలుగు పోస్టుల కోసం రాష్ట్రంలోని పలువురు నేతలు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఢిల్లీ పెద్దలతో మంతనాలు కూడా చేస్తున్నారు. అయితే.. ఈ ఆరు మంత్రి పదవులను గిరిజన, దళిత, వెనుకబడిన వర్గాలతో పాటు ఆయా జిల్లాలకు ప్రాతినిధ్యం కల్పించే ప్రతిపదికన ఇవ్వాలని పార్టీ నాయకత్వం భావిస్తున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో.. బీసీ, ఎస్సీ, రెడ్డి, మైనారిటీ లేదా ఎస్టీకి ఒకటి చొప్పున ఇవ్వనున్నట్టు తెలుస్తోంది. బీసీల్లో మున్నూరు కాపు, పద్మశాలి, గౌడ, ముదిరాజ్ వర్గాలకు చెందిన నేతలకు అవకాశం కల్పించనున్నట్టు సమాచారం.

ఇందులో భాగంగా.. బీసీ కోటాలో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ల పేర్లు వినిపిస్తున్నాయి. ఎస్సీ కోటాలో చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకట్ స్వామికి ఇచ్చే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఇక రెడ్డి కోటాలో.. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి రేసులో ఉండగా.. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, ఇబ్రహీం పట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కూడా పోటీ పడుతున్నట్టు తెలుస్తోంది. ఇక మైనారిటీ కోటాలో ఎమ్మెల్సీ మీర్ అమీర్ అలీఖాన్‌కు ఛాన్స్ ఉంది.

సీఎం, డిప్యూటీ సీఎంలు హైకమాండ్‌కు కలిసింది మంత్రివర్గ విస్తరణ కోసమే అయితే మాత్రం.. రేపటిలోగా అధికారిక ప్రకటన వెలువడే అవకాశం కనిపిస్తోంది. ఈ క్రమంలో.. అటు ఆశావాహుల్లోనే కాకుండా.. హస్తం పార్టీ శ్రేణుల్లో కూడా తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

# రిజర్వేషన్లు పెరిగితే ఎస్టీ వర్గీకరణకు యత్నిస్తాం

- సంక్షేమ పథకాల పేటెంట్ కాంగ్రెస్‌దే
- ఏజెన్సీలో ఎస్టీలకే ఉద్యోగాలు దక్కేలా చర్యలు
- శాసనసభలో మంత్రి సీతక్క



విశాలభారతి, స్టేట్ బ్యూరో:

రిజర్వేషన్లు పెంచుకున్నాక గిరిజనుల వర్గీకరణ చేపట్టేందుకు ప్రయత్నిస్తామని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు గతంలో మాదిరిగానే ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు ఇచ్చే అంశాలను పరిశీలిస్తామని చెప్పారు. పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్, మహిళా శిశు, గిరిజన, మైనారిటీ, దివ్యాంగుల సంక్షేమ శాఖల్లో డిమాండ్లపై చర్చలో ఆమె జవాబులు ఇచ్చారు. మంత్రి మాట్లాడుతూ.. 'సంక్షేమ పథకాలపై కాంగ్రెస్‌కే పేటెంట్ ఉంది. ఎస్సీ, ఎస్టీ మైనార్టీ, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ, మహిళా స్త్రీ శిశు సంక్షేమ శాఖలకు గతంతో పోల్చితే అత్యధిక నిధులు కేటాయించాం. రిజర్వేషన్ల బిల్లులు ఉన్నాయనే స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం వెళ్లలేదు. ఆదివాసీ గిరిజనుల వ్యవసాయాన్ని బలోపేతం చేసే విధంగా రుణాలు ఇస్తున్నాం. ఏజెన్సీ ప్రాంతాల్లో ఎస్టీలకే ఉద్యోగ అవకాశాలు దక్కేలా చర్యలు చేపడతాం. భారాస హయాంలో లక్షన్నర మందికిపైగా మహిళలపై దాడులు జరిగినట్లు కేంద్ర హోంశాఖ గణాంకాలు చెబుతున్నాయి. వాళ్లు ఇప్పుడు మహిళా భద్రత గురించి మాట్లాడుతుండటం విడ్డూరం' అని పేర్కొన్నారు. అనంతరం పంచాయతీరాజ్, రూరల్ వాటర్ సప్లై, రూరల్ డెవలప్‌మెంట్, మహిళా స్త్రీ శిశు సంక్షేమం, గిరిజన, మైనారిటీ, దివ్యాంగుల సంక్షేమ బిల్లులను సభ ఆమోదించింది. సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమైన సభ అర్ధరాత్రి 12.25 గంటల వరకు కొనసాగింది. మంగళవారం ఉదయం పదిగంటలకు సభను వాయిదా వేస్తున్నట్లు సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రకటించారు.

# చక్రయ్యది ఆధిపత్య హత్య

- మెంచు చక్రయ్య గౌడ్ హత్య కేసులో 13 మందిని అరెస్ట్ చేశాం
- రెండు కార్లు, ఒక కర్ర, 10 సెల్ ఫోన్ లు స్వాధీనం
- సొంత కూతుర్లు,అల్లుడులే హత్యకు కుట్రపన్నారు
- హత్య చేశారనేది స్వచ్ఛందంగా ఒప్పుకున్నారు.
- ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాం
- హత్యలో ప్రత్యక్షంగా పరోక్షంగా పాల్గొన్న ఎవరిని వదిలిపెట్టాం
- త్వరితగతిన ఫాస్ట్ ట్రాక్ బెస్ లో శిక్ష పడేలా చూస్తాం
- జిల్లా ఎస్పీ నరసింహ ఐపిఎస్



సూర్యాపేట, విశాలభారతి:

నూతనకల్ పోలీస్ స్టేషన్ పరిధి మిర్యాల గ్రామంలో జరిగిన మెంచు చక్రయ్య గౌడ్ హత్యకు సంభందించి 13 మంధిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించామని జిల్లా ఎస్పీ నరసింహ తెలిపారు. సూర్యాపేట డీఎస్పీ రవి, తుంగతుర్తి సర్కిల్ సీఐ శ్రీను ,ఎస్ఐ మహేందరనాథ్ లతో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఈ నెల 17 న మిర్యాలలో సుమారు 4:30 నుండి 5 గంటల సమయంలో మెంచు చక్రయ్య గౌడ్ ను అదే గ్రామానికి చెందిన దుండగులు దాడి చేసి అత్యంత పాశవికంగా హత్య చేశారు. దీనిపై నూతనకల్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేశాం. జిల్లా పోలీసులు, ఉన్నత స్థాయి పోలీసు అధికారులు చాలా సీరియస్ గా తీసుకున్నాం. దీనిలో భాగంగా నేరానికి పాల్పడిన వారిని పట్టు కోవడం కోసం ప్రత్యేక పోలీసు బృందాలు ఏర్పాటు చేశాం. సోమవారం తుంగతుర్తి పరిధిలో వాహనాలు తనికి చేస్తుండగా మెంచు చక్రయ్య హత్యలో పాల్గొన్న వ్యక్తిని, హత్యకు కుట్ర పన్నిన సొంత కుటుంబ సభ్యులైన అల్లుడు A1 కనకటి వెంకన్న @ వెంకటేశ్వర్లు, వెంకన్న భార్య A20 సునీతతో కలిపి మొత్తం 13 మందిని అదుపులో తీసుకున్నాం. వీరిని విచారించగా హత్యకు ఎలా పథకం పన్నారు, ఎలా హత్య చేశారు అనేది స్వచ్ఛందంగా ఒప్పుకున్నారు.ఈనెల 13న గ్రామ బొడ్డురాయి మహోత్సవం సందర్భంగా అందరూ కలిసి చక్రయ్య హత్యకు పన్నాగం పన్నారు. గ్రామంలో అన్నీ కార్యకలాపాల్లో చక్రయ్య ఆదిపత్యం కొనసాగుతున్నది, మనకు అడ్డువస్తున్నాడని అడ్డుతప్పించాలని నిర్ణయించుకున్నారు. చక్రయ్య గత 30, 40 సంవత్సరాలుగా గ్రామంలో గ్రామ పెద్దగా చలామణి అవుతూ గ్రామ సర్పంచిగా పని చేశాడు. తన మూడవ కూతురుని కూడా సర్పంచ్ చేశారు. అల్లుడు కనకటి వెంకన్న ను పిఏసిఎస్ చైర్మెన్ చేశారు. ఒక కుటుంబ సభ్యులుగా కలిసి ఉంటూ, కనకటి వెంకన్న పిఏసిఎస్ చైర్మెన్ అయిన్నప్పటి నుండి వెంకన్న నూతనకల్ మండలంలో తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నాడు. గ్రామంలో మెంచు చక్రయ్య ఆదిపత్యం ఉండడం వెంకన్న వర్గీయులు సహించలేక పోయారు, వ్యతిరేకంగా ఒక గ్రూపు గా ఏర్పడ్డారు. ఇలా వారి మధ్య మనస్పర్ధలు కొనసాగుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల అనంతరం 2023 సం.లో మెంచు చక్రయ్య కాంగ్రెస్ పార్టీలోకి వచ్చాడు, 2024 సం.లో కనకటి వెంకన్న కాంగ్రెస్ లోకి వచ్చారు. అయినప్పటికి చక్రయ్య ఆధిపత్యం కొంసాగిస్తున్న చక్రయ్యను అడ్డుతొలగించాలను కున్నారు. ఈ నెల 13 వతేదీన జరిగిన బొడ్రాయి ఉత్సవాలు దీనికి ఆజ్యం పోశాయి. గతంలో చూస్తే గతంలో A1 కనకటి వెంకన్న ఆధీనంలో ఉత్సవాలు జరిగేవి, చక్రయ్య ఈసారి ఉత్సవాలను తన అధ్వర్యంలో జరపాలని బహిరంగంగా ప్రకటించడంతో తట్టుకోలేక చక్రయ్యను అడ్డుతొలగించాలని కనకటి వెంకన్న అందరినీ పురామచి మీరు ప్రత్యక్షంగా పాల్గొనాలని పరోక్షంగా సహకారం అందిస్తానని వెంకన్న తెలిపారు. ఏ1, తన కుటుంబ సభ్యులు మరియు తన అనుచరులతో తన మామ మృతుడు మెంచు చక్రయ్యను చంపడానికి తన ఇంటి వద్ద పథకం పన్ని తన పథకంలో భాగంగా 17 మార్చి రోజున తన అనుచరులైన 1) కనకటి శ్రవణ్ 2) కనకటి లింగయ్య 3) కనకటి ఉప్పలయ్య 4) కనకటి శ్రీకాంత్ 5) గంధసిరి వెంకటేష్ 6) పెద్దింటి మధు 7) పెద్దింటి గణేష్ ల పురమాయించి ప్రతిరోజూ తన వ్యవసాయ పొలానికి వెళ్ళి వస్తున్న చక్రయ్యను అడ్డగించి ఆయుదాలు మరియు వెదురు కర్రలతో అతి కిరాతకంగా హత్య చేశారు. ఇది అంతా దూరంగా చెట్ల పొదల్లో ఉండి గమనిస్తున్న కనకటి వెంకన్న, చక్రయ్య చనిపోయాడని నిర్ధారించుకుని అక్కడి నుండి అందరూ పారిపోయారు. ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాం, హత్యలో ప్రత్యక్షంగా పరోక్షంగా పాల్గొన్న వారిని ఎవరిని వదిలిపెట్టకుండా అందరిపై కచ్చితమైన ఆధారాలు సేకరిస్తూ దర్యాప్తుని పారదర్శకంగా చేస్తూ అందరికీ కఠినమైన శిక్షలు పడెలాగా పోలీస్ శాఖ కృషి చేస్తుంది. త్వరితగతిన ఫాస్ట్ ట్రాక్ బెస్ లో శిక్ష పడేలా పోలీస్ శాఖ ప్రతిష్టాత్మకంగా తీసుకుని త్వరితగతిన కఠిన శిక్షలు పడేలా పోలీస్ శాఖ పని చేస్తుంది అన్నారు. ఈ కేసులో బాగా పని చేసి నేరస్తులను పట్టుకోవడం కృషి చేసిన అందరికీ రివార్డ్స్ అందించాం అన్నారు. కేసులో సమర్ధవంతంగా పని చేసిన సూర్యపేట డీఎస్పీ G రవి, డి. శ్రీను, సర్కిల్‌ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీసు, తుంగతుర్తి, ఐ. మహేంద్రనాథ్, ఎస్ఐనూతనకల్, ఎం. వీరయ్య, ఎస్ఐమద్దిరాల, ఆర్. క్రాంతి కుమార్, ఎస్ఐతుంగతుర్తి నూతనకల్ పోలీసు స్టేషన్ సిబ్బందిని అభినందించారు.





# ఆశా వర్కర్ల ఆందోళన ఉద్రిక్తం

- రూ.18వేల వేతనం ఇవ్వాలని డిమాండ్
- కోఠిలోని సీఎఫ్‌డబ్ల్యూ కార్యాలయం ముట్టడికి యత్నం
- అడ్డుకున్న పోలీసులు..
- వేర్వేరు ఠాణాలకు తరలింపు

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే తమకు స్థిర వేతనం రూ.18వేలుగా నిర్ణయించాలని ఆశా వర్కర్లు డిమాండ్ చేశారు. తమ 18 న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ తెలంగాణ రాష్ట్ర ఆశా వర్కర్ల యూనియన్ (సీఐటీయూఅనుబంధం) పిలుపు మేరకు కోఠిలోని కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ (సీఎఫ్‌డబ్ల్యూ) కార్యాలయం ముట్టడికి సోమవారం ఆశా వర్కర్లు కదం తొక్కారు. రాష్ట్రం నలుమూలల నుంచి వేల సంఖ్యలో తరలివచ్చిన వారిని పోలీసులు అడ్డుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఆశావర్కర్లు పోలీసుల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట జరిగాయి. దీంతో పలువురు సొమ్మసిల్లి పడిపోయారు. వందల మందిని పోలీసులు వాహనాల్లో ఎక్కించి నగరంలోని వివిధ ఠాణాలకు తరలించారు. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వచ్చిన వారిని అరెస్టు చేయడం దుర్మార్గమని రాష్ట్ర ఆశా వర్కర్ల సంఘం అధ్యక్షురాలు పి.జయలక్ష్మి, సీఐటీయూ రాష్ట్ర నాయకుడు భూపాల్ మండిపడ్డారు. తమ సేవలను, కష్టాలను గుర్తించి స్థిర వేతనం చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఏఎన్ఎం శిక్షణ పూర్తి చేసిన ఆశాలకు పదోన్నతి కల్పించాలని కోరారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు రూ.50లక్షల జీవిత బీమా, మట్టి ఖర్చులకు రూ.50వేలు చెల్లించే విధంగా ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు.

# అశుతోష్ దెబ్బ అదుర్స్..

తరువాయిభాగం




భారీ లక్ష్యంతో దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ తొలి 10 బంతుల్లోనే 3 వికెట్లను కోల్పోయింది. తొలి ఓవర్ లోనే శార్దూల్ ఠాకూర్ రెండు వికెట్లు పడగొట్టాడు. జేక్ ఫ్రేజర్‌మెక్‌గుర్క్(1), అభిషేక్ పోరెల్(0) తొలి ఓవర్ లోనే ఔటయ్యారు. రెండో ఓవర్ లో స్పిన్నర్ సిద్ధార్థ్ మరో షాక్ ఇచ్చాడు. సమీర్ రిజ్వీ (4)ని పెవిలియన్ కు పంపాడు. ఈ దశలో డుప్లెసిస్(29), అక్షర్ పటేల్(22) కాసేపు మెరుపులు మెరిపించారు. పవర్ ప్లే ముందు అక్షర్ పటేల్.. ఆ తర్వాత డుప్లెసిస్ వికెట్లను కోల్పోయింది. దీంతో ఢిల్లీ 65 పరుగులకే 5 వికెట్లను చేజార్చుకుని కష్టాల్లో పడింది. ఓటమి ఖామనుకున్న దశలో స్టబ్స్, అశుతోష్ శర్మ ఇన్నింగ్స్ ను నిలబెట్టారు. 6 వికెట్ కు 48 పరుగులు జోడించి పరిస్థితిని చక్కదిద్దారు.

స్టబ్స్(34) ఔటైన తర్వాత విప్రజ్ నిగమ్ పవర్ హిట్టింగ్ తో మ్యాచ్ ను ఆసక్తికరంగా మార్చాడు. 15 బంతుల్లోనే 39 పరుగులు చేసి లక్నోని వణికించాడు. ఈ దశలో వరుసగా రెండు వికెట్లు కోల్పోవడంతో ఢిల్లీ ఓటమి ఖాయమనుకున్నారు. అయితే అశుతోష్ శర్మ శర్మ అసాధారం ఇన్నింగ్స్ తో జట్టును గెలిపించాడు. 31 బంతుల్లోనే 66 పరుగులు చేసి ఢిల్లీకి విజయాన్ని అందించాడు. లక్నో బౌలర్లలో శార్దూల్ ఠాకూర్, సిద్దార్ధ్, రాఠ్, బిష్ణోయ్ తలో రెండు వికెట్ల తీసుకున్నారు.

అంతకముందు టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన లక్నో సూపర్ జయింట్స్ భారీ స్కోర్ చేసింది. పూరన్, మిచెల్ మార్ష్ ల విధ్వంసంతో నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 209 పరుగులు చేసింది. 30 బంతుల్లోనే 7 సిక్సర్లు.. 6 ఫోర్లతో 75 పరుగులు చేసిన పూరన్ టాప్ స్కోరర్ గా నిలిచాడు. మరో ఎండ్ లో ఆస్ట్రేలియా ఆల్ రౌండర్ మిచెల్ మార్ష్ 36 బంతుల్లో 6 ఫోర్లు.. 6 సిక్సర్లతో 72 పరుగులు చేసి దుమ్ములేపాడు. లక్నో బౌలర్లలో స్టార్క్ మూడు వికెట్లు తీసుకున్నాడు. కుల్దీప్ యాదవ్ రెండు వికెట్లు తీసుకోగా.. ముకేశ్, నిగమ్ లకు తలో వికెట్ లభించింది.

# త్వరలో భూముల ధరల పెంపు

తరువాయిభాగం



ప్రక్రియను పూర్తిచేస్తుంది. రిజిస్ట్రేషన్ల శాఖకు రుసుం చెల్లించాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ లేదా జిల్లా కలెక్టర్ల నుంచి ఎల్ఆర్ఎస్ సర్టిఫికెట్ పొందొచ్చు. గతంలోని లేఅవుట్లలో 10శాతం రిజిస్ట్రేషన్ పూర్తయితే మిగిలినవి క్రమబద్ధీకరణ అవుతాయి.

**పెరగనున్న భూముల ధరలు..**

రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో భూములు, స్థలాల బహిరంగ ధర, మార్కెట్ విలువల మధ్య హెచ్చుతగ్గులు ఉన్నాయి. వీటిని సవరిస్తాం. కొత్త రెవెన్యూ చట్టం భూభారతి అమల్లోకి వచ్చాక మార్కెట్ విలువ పెంపు ఉంటుంది. వచ్చేనెలలో కొత్త చట్టం, భూ అక్రమాలపై ఫోరెన్సిక్ ఆడిట్ ప్రక్రియలపై ప్రకటన చేస్తాం. ఎల్ఆర్ఎస్ కానిచోట్ల సబ్ రిజిస్ట్రార్లు అవినీతికి పాల్పడుతూ సస్పెండవుతున్న పరిస్థితులు చూస్తున్నాం. ఉగాది నుంచి పైలట్ పద్ధతిలో 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ పద్ధతిలో నమోదు చేసుకుని రిజిస్ట్రేషన్‌కు వచ్చేలా సేవలు అందుబాటులోకి తేనున్నాం. భూములు, స్థలాల రిజిస్ట్రేషన్లకు సర్వే మ్యాప్ తప్పనిసరి చేయనున్నాం. దీనివల్ల క్రమేపీ ప్రతి భూమి సర్వే పూర్తవుతుంది. రిజిస్ట్రేషన్‌కు రాని వాళ్లు భూమిని లేదా స్థలాన్ని సర్వే చేయించుకోవాలనుకుంటే ప్రభుత్వం సహకరిస్తుంది. రాష్ట్రవ్యాప్తంగా ఆరువేల మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లకు శిక్షణ ఇచ్చి అవకాశం కల్పిస్తాం.

**సాదాబైనామాలపై అప్పీళ్లకు అవకాశం**

బీఆర్ఎస్ ప్రభుత్వం సాదాబైనామాల క్రమబద్ధీకరణకు దరఖాస్తులు స్వీకరించి వదిలేసింది. 12 లక్షల దరఖాస్తుల్లో చాలావరకు కలెక్టర్లు తిరస్కరించారు. మా ప్రభుత్వం కొత్త దరఖాస్తులు స్వీకరించదు. గతంలో తిరస్కరణకు గురైన వారిలో అర్హులుంటే వారు కొత్త చట్టం అమల్లోకి వచ్చాక అప్పిలేట్ అథారిటీ వద్ద దరఖాస్తు చేసుకోవచ్చు. అర్హుల సాదాబైనామాలను క్రమబద్ధీకరిస్తాం. గ్రామ పరిపాలన అధికారుల (జీపీవో) పోస్టులకు మూడు రోజుల్లో నోటిఫికేషన్ జారీ చేస్తాం. పూర్వ వీఆర్ఏ, వీఆర్వోలలో ఇంటర్ విద్యార్హత ఉన్న వారిలో అర్హులను రాత పరీక్ష ద్వారా తీసుకుంటాం. మొత్తం ఆరువేల మంది వరకు ఉన్నట్లు అంచనా. కేంద్రం ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద అర్బన్ ప్రాంతాలకు 1.13 లక్షల ఇళ్లను మంజూరు చేసింది. గ్రామీణ ప్రాంతాలకు సంబంధించి వారినుంచి స్పష్టత రాలేదు. రాష్ట్ర ప్రభుత్వం నిర్మించే ఇళ్లపై కేంద్రం ఇచ్చే లోగోను ఏర్పాటుచేస్తాం. జీవో59 భూ క్రమబద్ధీకరణ కింద రాష్ట్రవ్యాప్తంగా ఖరీదైన ప్రాంతాల్లో ప్రభుత్వ భూములను కొందరు ఆక్రమించారు. అలాంటి వాటిని గుర్తించి ఇప్పటికే నిలుపుదల చేశాం. పెద్దలు ఆక్రమించుకున్న ఎసైన్డ్ భూములను మాత్రమే పేదలకు పంచుతామని గతంలో చెప్పాం. ఎస్ఎల్‌బీసీ సొరంగంలో మిగిలిన పనులను టీబీఎం ద్వారా కాకుండా మాన్యువల్‌గా చేయాల్సి ఉంటుంది'' అని మంత్రి పేర్కొన్నారు.

vishalabharathi Telugu Daily

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

మంగళవారం
25.03.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



# అడ్వొకేట్ దారుణ హత్య

విశాలభారతి, స్టేట్ బ్యూరో: హైదరాబాద్‌లో పట్టపగలు నడిరోడ్డుపై అడ్వకేట్ దారుణ హత్యకు గురయ్యారు. అడ్వొకేట్ ఇజ్రాయిల్‌ను కత్తితో పొడిచి హత్య చేశాడు ఎలక్ట్రీషియన్ దస్తగిరి. అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఇజ్రాయిల్ మృతిచెందారు. ఓ మహిళను వేధిస్తున్న ఘటనలో దస్తగిరిపై లాయర్ ఇజ్రాయిల్ ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలోనే కక్ష పెంచుకుని ఇజ్రాయిల్‌పై కత్తితో దాడి చేశాడు. సోమవారం ఉదయం హైదరాబాద్ సంతోష్‌నగర్ పరిధిలోని న్యూ మారుతీనగర్‌లో ఈ ఘటన జరిగింది. అడ్వకేట్ ఇజ్రాయిల్ ఇంట్లో అద్దెకు ఉండే ఓ మహిళను.. దస్తగిరి అనే ఓ ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ వేధింపులకు గురిచేశాడు. ఈ విషయాన్ని బాధిత మహిళ ఇజ్రాయిల్‌కు చెప్పడంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనపైనే ఫిర్యాదు చేస్తారా అని.. కక్ష గట్టిన దస్తగిరి అడ్వకేట్ ఇజ్రాయిల్‌పై కత్తితో దాడి చేసి హత్య చేశాడు. మర్డర్ సమాచారం అందుకున్న పోలీసులు.. వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. కేసు నమోదుచేసి నిందితుడిన అదుపులోకి తీసుకున్నారు. పట్టపగలు అందరూ చూస్తుండగా ఈ దారుణం జరగడంతో.. స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.



## మెంచు చక్రయ కుటుంబాన్ని పరామర్శించిన పిఏసిఎస్ చైర్ పర్సన్

నూతనకల్, విశాలభారతి: మండల పరిధిలోని మిర్యాల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మెంచు చక్రయ్య గౌడ్ ఇటివలే హత్యకు గురికాగా సోమవారం నూతనకల్లు పిఏసిఎస్ చైర్ పర్సన్ నాగం జయసుధ సుధాకర్ రెడ్డి మెంచు చక్రయ్య కుటుంబాన్ని పరామర్శించి, చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు, మృతుని కుటుంబానికి మనోధైర్యం కల్పించి 20.వేల రూపాయలు ఆర్ధిక సహాయం అందించారు. ఈ సందర్భంగా నూతనకల్లు మండల అధ్యక్షులు నాగం సుధాకర్ రెడ్డీ మాట్లాడుతూ చక్రయ్య మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి చక్రయ్య చేసిన కృషి వెలకట్టలేనిదని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో నూతనకల్ మండల ఉపాధ్యక్షులు తోనుకునూరి సైదులు, నూతనకల్ ప్రధాన కార్యదర్శి బంటు బద్రి , కిసాన్ సెల్ మండల అధ్యక్షులు ఉప్పుల పాపయ్య ,డీసీసీ కార్యదర్శులు కళ్లెం కృష్ణారెడ్డి ,గుగులోతు కృష్ణనాయక్, సేవాదళ్ మండల అధ్యక్షులు నెల్లుట్ల మహేష్ ,మండల నాయకులు జటంగి గణేష్ యాదవ్, దరిపెల్లి వీరన్న , గునుగంటి వెంకన్న ,అనంతుల శ్రీను, మేడిపల్లి అశోక్, బద్దం ప్రశాంత్ గ్రామకాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.





## ఘనంగా శ్రీ వీరభద్ర స్వామి కళ్యాణోత్సవం

- పాల్గొన్న కాట సుధా శ్రీనివాస్ గౌడ్

పటాన్ చెరు,విశాలభారతి: గుమ్మడిదల మండలం బొంతపల్లి గ్రామంలోని శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాట సుధా స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి, భక్తులతో కలిసి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆలయ మహోత్సవాలు ఎంతో వైభవంగా జరుగుతున్నాయని చెప్పారు. ప్రజలంతా శాంతి, సంపదలతో అభివృద్ధి చెందాలని స్వామివారిని కోరినట్టు తెలిపారు.



## జమిలి ఎన్నికలే అభివృద్ధి భారత్ కి సోపానం

- ఉడుగుల రమేష్ బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

దేవరుప్పల, విశాలభారతి: బిజెపి దేవరుప్పుల మండల అధ్యక్షులు పెద్దగౌని రాజు అధ్యక్షతన,ఒక దేశం ఒకే ఎన్నిక వర్క్ షాప్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉడుగుల రమేష్, పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. భారతదేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే జమిలి ఎన్నికల నిర్వహణతోనే సాధ్యం అవుతుందని అన్నారు. జమిలి ఎన్నికలు నిర్వహించకపోతే ప్రజాధనంతో పాటు ప్రభుత్వాల కార్య నిర్వహణ సమయం వృధా అవుతుందని అన్నారు. గత కాంగ్రెస్ పాలనలో దేశం ఆస్తిత్వం పాలుకావడానికి ప్రధాన కారణం పార్లమెంట్, ఎన్నికలతో అసెంబ్లీ ఎన్నికల్లో అస్థిరత తీసుకో రాకపోవడంతో దేశం ప్రతి రెండు నెలలకు ఒకసారి ఎన్నికల జరగడం వలన దేశాభివృద్ధి కుంటుపడుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి దుబ్బ రాజశేఖర్ గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి చింత సృజన్, జిల్లా నాయకులు కాసాని సత్యనారాయణ, భాగాల నవీన్ రెడ్డి,ఒకే దేశము ఒకే ఎన్నిక మండల కోకన్వీనర్ నరసింహచారి తదితరులు పాల్గొన్నారు.



## వెంకన్న మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు

- ఏఎంసి చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి

నూతనకల్ విశాలభారతి: నూతనకల్ మండలం అల్లునూరు గ్రామ కాంగ్రెస్ పార్టీ అద్యక్షులు బంటు క్రాంతి మామ మల్లేబోయిన వెంకన్న ఇటివల మరణించడంతో వారి దశదిన కార్యక్రమంలో పాల్గొని వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, భరోసా కల్పించిన తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లెబోయిన వెంకన్న మృతి కాంగ్రెస్ తీరని లోటు అన్నారు..ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ లు బండపల్లి సాగర్, గాజుల వెంకటయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు పసుల అశోక్ ,బొల్క సైదులు ,లావుడ్యా శ్రీధర్ నాయక్, మోహన్ నాయక్, నిద్ర సంపత్, బండపల్లి చందు, బండపల్లి మహేష్, బన్ని, బొల్క మల్లయ్య, కోల శివ, వంశీ,మరికంటి అశోక్ తదితర కుటుంబ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు



## కృష్ణ పార్థివ దేహానికి నివాళులార్పించిన తీగల

విశాలభారతి,నూతనకల్ : నూతనకల్ మండలం ఎర్రపహాడ్ గ్రామానికి చెందిన కేతం కృష్ణ కారుప్రమాదంలో మృతి చెందారు. వారి పార్థివ దేహానికి పూలమాలతో నివాళులర్పించిన తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు పచ్చిపాల సుమతి వెంకన్న యాదవ్ గ్రామ శాఖ అధ్యక్షుడు లింగాల రామచంద్రయ్య గౌడ్, పిఏసిఎస్ డైరెక్టర్ పసుల వెంకన్న యాదవ్ మాజీ ఎంపీటీసీ లు బండపల్లి సాగర్, గాజుల వెంకటయ్య ,పసుల అశోక్ , పసుల రవి యాదవ్ మూరగుండ్ల జనార్ధన్,పసుల సుధాకర్ యాదవ్ చిర్ర శ్రీనాథ్ గౌడ్, కుటుంబ సభ్యులు,కేతం రాములు కేత మహేందర్, కేతం శ్రీనివాస్ యువజన కాంగ్రెస్ నాయకులు లావుడ్యా శ్రీధర్ నాయక్, ముడ్ మోహన్ నాయక్, ఇద్దప్ప, వెంకటమల్లు, లింగయ్య గౌడ్, అప్పయ్య, చందు, మహేష్, మరికంటి అశోక్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## ప్రేమలతను పరామర్శించిన వేరు సంఘం కమిటీ

జనగాం, విశాలభారతి: పట్టణంలో కొద్దిరోజుల క్రితం మాడిశెట్టి సీతయ్య, మరియు గూడూరు ప్రేమలత అనారోగ్యంతో మరణించగా, వారి చిత్రపటాలకు పూలదండ వేసి మౌనం పాటించి, కుటుంబ సభ్యులను పరామర్శించిన, జనగామ జిల్లా మేరు సంఘం కమిటీ, తదనంతరం సందర్భంగా జిల్లా అధ్యక్షులు రాపర్తి ప్రశాంత్ జిల్లా కమిటీ సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ, సంఘం యొక్క అభివృద్ధి కోసం మూడు నియోజకవర్గ ఎమ్మెల్యేలను కలిసి మనకు రావలసిన నిధుల గురించి చర్చించారు. సంఘం సభ్యులందరూ మన మేరు సంఘం అభివృద్ధికి తోడ్పడి ఉండాలని అన్నారు. మరుసటి నెల సమావేశం చిలుపూరు గుట్టలో ఏర్పాటు చేయబడును అని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో రాపర్తి ప్రశాంత్, దీకొండ విష్ణు, సోమ.సత్యం, కీర్తి యాదగిరి, పొడిశెట్టి లక్ష్మీనారాయణ, ఓడపల్లి రమేష్, కొత్తకొండ రవి, రామగిరి విజయ్ కుమార్, రాయబారపు రమేష్, జనగామ పట్టణ అధ్యక్షులు రామగిరి శ్రావణ్ కుమార్, లింగాల గణపురం మండల అధ్యక్షులు కీర్తి రమేష్, తదితరులు పాల్గొన్నారు.



## ఎంఎంటీఎస్ రైల్లో రేప్ అటెంప్ట్...

తరువాయి భాగం

చేపట్టాలన్నారు. నిందితుడిని వీలైనంత తొందరగా పట్టుకుని కఠినంగా పనిష్మెంట్ పడేలా చూడాలన్నారు. తాజాగా.. బాధిత మహిళ ఘటనపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్పందించారు.కేంద్ర మంత్రి ఆదేశాల మేరకు.. బీజేపీ నేతలు.. సదరు బాధితురాలిని సికింద్రాబాద్ యశోద ఆస్పత్రికి తరలించారు. బాధితురాలికి మెరుగైన వైద్య సేవలు అందించాలని కేంద్ర మంత్రి వైద్యుల్ని కోరారు. మహిళ కోలుకునే వరకు బీజేపీ అండగా ఉంటుందన్నారు. ఈ ఘటనపై ఇప్పటి వరకు కూడా తెలంగాణ ప్రభుత్వం స్పందించక పోవడం షాకింగ్ కు గురిచేస్తుదన్నారు. ఒక ఆడపిల్లకు ఇంత అన్యాయం జరిగిన రేవంత్ సర్కారు కనీసం ఖండిచడంలేదన్నారు. తెలంగాణలో శాంతిభద్రతలు ఎలా ఉన్నాయో.. ఈ ఘటనలు చూస్తే అర్థమౌతుందన్నారు. అంతేకాకుండా.. తెలంగాణలో హోంశాఖ లేకపోవడం కూడా ఇక్కడ నేరాలు పెరగటానికి ఒక కారణమన్నారు. ఇలాంటి ఘటనలు మళ్లీ జరక్కుండా.. తెలంగాణ ప్రభుత్వం, రైల్వేడిపార్ట్ మెంట్ కఠినంగా చర్యలు తీసుకొవాలని డిమాండ్ చేశాడు.

అనంతపురంకు చెందిన యుతివతి మేడ్చల్ లో ప్రైవేటు కంపెనీలో పనిచేస్తుంది. సికింద్రాబాద్ లో ఒక పనికోసం వచ్చింది. ఆతర్వాత మరల మేడ్చల్ వెళ్లేందుకు ట్రైన్ ఎక్కింది. అల్వాల్ లో ఇద్దరు మహిళలు దిగిపోయారు. అప్పటికే భోగీలో ఒక యువకుడు కూర్చుని ఉన్నాడు. అతను కోంపల్లిరాగానే.. యువతి దగ్గరకు వెళ్లి అఘాయిత్యానికి ప్రయత్నించాడు. వెంటనే సదరు మహిళ ప్రతిఘటించి.. ట్రైన్ లో నుంచి కిందకు దూకేసింది. వెంటనే రోడ్డు మీద ఉన్న ప్రయాణికులు యువతిని గమనించి ఆస్పత్రికి తరలించారు. బాధితురాలికి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న జీఆర్పీ పోలీసులు విచారణ చేపట్టారు.




## గ్రూప్ 1 మెయిన్స్‌పై వివాదం

తరువాయి భాగం నాణ్యత కొరవడిందన్నారు. తెలుగు మీడియం అభ్యర్థులకు అన్యాయం జరిగిందని పిటిషనర్లు పేర్కొన్నారు. పిటిషనర్ల వాదనలు విన్న హైకోర్టు.. టీజీపీఎస్సీకి నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లో కౌంటర్ వేయాలని టీజీపీఎస్సీని హైకోర్టు ఆదేశించింది. గ్రూప్1 మెయిన్స్‌పై తదుపరి విచారణను హైకోర్టు ధర్మాసనం నాలుగు వారాలకు వాయిదా వేసింది. కాగా.. ఈనెలలోనే గ్రూప్1 మెయిన్స్ ఫలితాలతో పాటు గ్రూప్2, గ్రూప్3 ఫలితాలను కూడా టీజీపీఎస్సీ విడుదల చేసిన విషయం తెలిసిందే. మెయిన్స్ ఫలితాలను విడుదల చేసినప్పటి నుంచే తెలుగు మీడియం అభ్యర్థులు తమకు అన్యాయం జరిగిందని ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. ఈ విషయమై ఎమ్మెల్సీ కవిత, ఇటీవలి ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయిన ప్రసన్న హరికృష్ణ కూడా స్పందించారు. గ్రూప్ 1 అభ్యర్థులకు న్యాయంచేయాలని ప్రభుత్వాన్ని వీరు డిమాండ్ చేశారు. మార్చి 10, 11 తేదీల్లో గ్రూప్ 1 మెయిన్స్, గ్రూప్2 రాత పరీక్షల మార్కులు వెల్లడయ్యాయి. అలాగే మార్చి14న గ్రూప్3 ఫలితాలను కూడా టీజీపీఎస్సీ రిలీజ్ చేసింది. వివిధ ప్రభుత్వ శాఖల్లో 563 పోస్టుల భర్తీకి గాను.. గత ఏడాది అక్టోబరు 21 నుంచి 27 వరకు గ్రూప్1 పరీక్షలు జరిగాయి. మెయిన్స్ పరీక్షలకు 21,093 మంది అభ్యర్థులు హాజరయ్యారు. అలాగే గతేడాది డిసెంబర్ 15, 16 తేదీల్లో 783 గ్రూప్2 పోస్టుల భర్తీకి పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షకు మొత్తం 2.36 లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఇక 1,365 గ్రూప్3 సర్వీస్‌ల పోస్టుల భర్తీ కోసం రాత పరీక్షలు నిర్వహించింది టీజీపీఎస్సీ. గత ఏడాది నవంబర్ 17, 18 తేదీల్లో గ్రూప్ 3 రాత పరీక్షలు జరిగాయి. ఈనెల 14న గ్రూప్3 ఫలితాలను టీజీపీఎస్సీ విడుదల చేసింది.



తన రాజకీయ గురువు, మార్గదర్శకులు తెలంగాణ రాష్ట్ర ఆరోగ్యం, వైద్య, కుటుంబ సంక్షేమం, శాస్త్ర & సాంకేతిక శాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో అసెంబ్లీ ప్రాంగణంలో పటాన్ చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
మంగళవారం
25.03.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com






# మానవ మనుగడకు నీరే ప్రాణాధారం

**తుర్కయంజాల్,విశాలభారతి:**

మానవాళి మనుగడకు నీరే ప్రాణాధారమని, జల భద్రతతోనే భవిష్యత్ సురక్షితంగా ఉంటుందని హెచ్ఎండబ్ల్యూఎస్ మేనేజర్ జి. వినయ్ కుమార్ అన్నారు. హెచ్ఎండబ్ల్యూఎస్ సహకారంతో తుర్కయంజాల్‌లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో గాయత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ జలదినోత్సవాన్ని నిర్వహించారు. నీటి ప్రాధాన్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వినయ్ మాట్లాడుతూ నీటిని వృథా చేయొద్దని, ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గాయత్రి ఫౌండేషన్ సీఈవో బానాల రవికుమార్, స్కూల్ ప్రిన్సిపల్ భవిత, అకౌంటెంట్ సింధూర, ఎం.పద్మ, కృష్ణమాచార్యులు, మహేష్, శబానా, అనూష తదితరులు పాల్గొన్నారు.

# పట్నంలో ప్రైవేట్ పాఠశాలల అడ్మిషన్ల దందా

- ప్రైవేట్ విద్యాసంస్థల ముందస్తు అడ్మిషన్లు అరికట్టాలి
- స్పెషల్ ఆఫర్ పేరుతో బ్యానర్లు, కరపత్రాలతో హడావిడి
- ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి ఏర్పుల తరంగ్



**ఇబ్రహీంపట్నం, విశాల భారతి:**

పాఠశాలల అకాడమిక్ ఇయర్ పూర్తికాకుండానే ఇబ్రహీంపట్నంలోని పాఠశాలల ఉపాధ్యాయులకు ఓ టార్గెట్స్ కేటాయించి ఇంటింటి అడ్మిషన్ కోసం నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న ప్రైవేట్ కార్పొరేట్ విద్య సంస్థల పై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ ఇబ్రహీంపట్నం డివిజన్ కార్యదర్శి ఏర్పుల తరంగ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు టార్గెట్స్ కేటాయించి ఇంటింటి అడ్మిషన్ నిర్వహిస్తున్న వారిపై చట్టరిత్యా చర్యలు తీసుకోవాలనీ, అకాడమిక్ ప్రారంభం కాకముందే స్పెషల్ ఆఫర్ పేరుతో బ్యానర్లు, కరపత్రాలు హడావిడి చేస్తున్నటువంటి యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు పెట్టాలన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరం పూర్తికాక ముందే వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించి ఇప్పుడే అడ్మిషన్లు ప్రారంభం అంటూ పెద్ద పెద్ద హోర్డింగ్స్, ప్రచార రథాల ద్వారా ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ఇంటింటికీ తిరుగుతూ ఇప్పుడు అడ్మిషన్ తీసుకుంటే ఆఫర్ అంటూ మాయ మాటలు చెప్పి విద్యార్థుల తల్లిదండ్రులను ప్రలోభాలకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. ముందస్తు అడ్మిషన్ల కోసం ఇంటికి వచ్చే పాఠశాల ఉపాధ్యాయులను విద్యార్థుల తల్లి దండ్రులు తరిమికొట్టాలని సూచించారు. ముందస్తు అడ్మిషన్లకు ప్రభుత్వ అధికారులు వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. ముందస్తు ప్రచారాన్ని చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అడ్మిషన్లు నిర్వహిస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థల ముందస్తు అడ్మిషన్ల ప్రక్రియను అడ్డుకోవాలని లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళనలో నిర్వహిస్తామని హెచ్చరించారు..



# ప్రజావాణి కార్యక్రమానికి 72 ఫిర్యాదులు

- వివరాలు వెల్లడించిన రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డికి

**ఇబ్రహీంపట్నం,విశాలభారతి:**

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 72 ఫిర్యాదులు అందాయనీ జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. జిల్లాలోని వివిధప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జలమండలి జనరల్ మేనేజర్ కి వినతిపత్రం అందించిన కార్పొరేటర్

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**



హయత్ నగర్ డివిజన్ లో ఉన్న పలు కాలనీలలో భూగర్భ డ్రైనేజ్ పైప్ లైన్ సదుపాయం, మంచి నీటి పైప్ లైన్ సదుపాయం లేకపోవడంతో కాలనీలలోని ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనితో సమస్య తీవ్రతను గుర్తించిన స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి సోమవారం హయత్ నగర్ జలమండలి కార్యాలయంలో జనరల్ మేనేజర్ శ్రీనివాస్ కలిసి నూతన భూగర్భ డ్రైనేజ్, మంచినీటి పైప్ లైన్ నిర్మాణం కోసం వినతిపత్రం ఇచ్చారు. దీనికి సానుకూలంగా స్పందించిన జలమండలి జనరల్ మేనేజర్ వీలైనంత త్వరలో సమస్యను పరిష్కరిస్తామని హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# ఎల్ఆర్ఎస్ రాయితీ సద్వినియోగం చేసుకోవాలి

**బాల్కొండ,విశాలభారతి**




ఎల్ఆర్ఎస్ రాయితీ పొందడానికి ఇంకో వారం వరకు అవకాశం ఉందని మున్సిపల్ కమీషనర్ గోపు గంగాధర్ అన్నారు. ప్రభుత్వం కల్పించిన రాయితీ అవకాశం ఎల్ఆర్ఎస్ దరఖాస్తు దారులందరు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మున్సిపాలిటీకి వచ్చిన దరఖాస్తులు 1160 కాగా అందులో కేవలం 82 మంది మాత్రమే ఎల్ఆర్ఎస్ ఫీ చెల్లించడం జరిగిందని అన్నారు.మిగితా వారు ప్రభుత్వం కల్పించిన 25 శాతం రాయితీ వెసులుబాటును వినియోగించుకుని నెలాఖరు లోపు చెల్లించాలని కోరారు.ఈ సందర్భంగా ఎల్ఆర్ఎస్ రుసుము చెల్లించిన వారికి ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు.






# భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక పటాన్ చెరు

- ముస్లింల సంక్షేమానికి సంపూర్ణ సహకారం
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్ని మతాల సారాంశం ఒక్కటే
- ప్రముఖ వక్త బ్రదర్ షఫీ - ఎమ్మెల్యే జీఎంఆర్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

**పటాన్ చెరు,విశాలభారతి**

మినీ ఇండియా గా పేరొందిన పటాన్ చెరు నియోజకవర్గం భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలుస్తోందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. కులం మతం ప్రాంతాలకు అతీతంగా పరమత సహనం పెంపొందిస్తున్నామని తెలిపారు. ముస్లింల అభివృద్ధికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు.. సొంత నిధులతో నియోజకవర్గ వ్యాప్తంగా మసీదులు, అశీర్ఖనాలు నిర్మించడం జరిగిందని తెలిపారు. గత 25 సంవత్సరాలుగా ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రంజాన్ పవిత్ర మాసం పురస్కరించుకుని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో నియోజకవర్గ స్థాయి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ తాజా మాజీ ప్రజాప్రతినిధులు, ముస్లిం మత పెద్దలు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ వక్త, బ్రదర్ షఫీ పరమత సహనంపై ప్రత్యేకంగా బోధనలు చేశారు. అన్ని మతాల సారాంశం ఒక్కటేనని.. కష్టనష్టాలలో ఒకరికొకరు అండగా నిలవాలని కోరారు. ప్రపంచంలోనే భారతదేశం విభిన్నమైనదని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. గత పది సంవత్సరాలుగా మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. నియోజకవర్గ ప్రజలందరికీ రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలలో ముస్లింలకు తగు ప్రాధాన్యత కల్పిస్తున్నామని తెలిపారు..
అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, విందు భోజనాలు ఏర్పాటు చేశారు.
ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గాలి అనిల్ కుమార్, నియోజకవర్గ తాజా మాజీ ప్రజాప్రతినిధులు, ముస్లిం మత పెద్దలు, ముస్లింలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



# వాసవి క్లబ్ అధ్యక్షుడిగా చిదిరాల నవీన్ కుమార్

**తొర్రూర్, విశాలభారతి:**

తొర్రూరు పట్టణ కేంద్రంలోని స్థానిక రామ ఉపేందర్ గార్డెన్లో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సమావేశం మచ్చ సురేష్ అధ్యక్షతన నిర్వహించగా ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేటర్ గార్లపాటి శ్రీనివాసులు, మానుకోట డిస్ట్రిక్ట్ గవర్నర్ వెమిశెట్టి కిషోర్ కుమారులు పాల్గొని సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ వాసవి క్లబ్,వాసవి క్లబ్ కపుల్స్, వాసవి క్లబ్ సరస్వతి,వాసవి క్లబ్ వనిత, వాసవి క్లబ్ చత్రపతి శివాజీ యూత్ ల అధ్యక్షులు,ప్రధాన కార్యదర్శులు,కార్యవర్గ సభ్యులు సమిష్టిగా కృషి చేసి అభివృద్ధి పథంలో ముందుకు వెళ్లాలని అన్నారు. అదేవిధంగా పట్టణ కేంద్రానికి చెందిన చిదిరాల నవీన్ కుమార్ న్ను వాసవి క్లబ్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా వాసవి క్లబ్ నూతన అధ్యక్షుడు నవీన్ కుమార్ మాట్లాడుతూ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నానని తెలుపుతూ వాసవి క్లబ్ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు.



# స్మశాన వాటికలో ప్రవారీ గోడ నిర్మాణం చేయాలి

- ఉప్పల్ ఎమ్మెల్యే కలిసిన గౌడ సంఘం నాయకులు

**కాప్రా, విశాలభారతి:**

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సైనిక్ పూరిలోని తన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి స్మశాన వాటికలో ప్రవారీ గోడ నిర్మాణం చేయాలని కోరారు.సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తప్పకుండా చేస్తానని హామిలిచ్చారు. తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని అన్నారు. నియోజక వర్గ అభివృద్ధికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ప్రవీణ్ ముదిరాజ్, గౌడ సంఘం నాయకులు పల్లె రాజు కుమార్, నేర్ధం భాస్కర్, అర్జున్,నవీన్, భరత్ తదితరులు పాల్గొన్నారు.



# తొర్రూరు అంగడి బహిరంగ వేలం

**తొర్రూర్, విశాలభారతి:**

తొర్రూరు పట్టణ కేంద్రంలోని 2025 2026 సంవత్సరానికి సంబంధించిన అంగడి బహిరంగ వేలం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ పుట్టల శాంతి కుమార్ మాట్లాడుతూ.తొర్రూర్ అంగడి వేలంలో పశువుల రహదారి వేలంను నర్కెట్ పల్లికి చెందిన ముత్యాల ఆంజనేయులు 37లక్షల 32 వేలకు బహిరంగ వేలం ద్వారా టెండర్ ను దక్కించుకోవడం జరిగింది. అదేవిధంగా చికెన్ వ్యర్థల సేకరణ కోసం బహిరంగ టెండర్ ని ఎ.ఎల్.ఎం ప్రసాద్ ఒక లక్ష పదివేల రూపాయలకు దక్కించుకోవడం జరిగిందని తెలుపుతూ,కమేలా టెండర్ ను తొర్రూర్ పట్టణ కేంద్రానికి చెందిన మన్నెం ప్రణీత్ కుమార్ 68 వేలకు టెండర్ ను దక్కించుకున్నారని, తైబజార్ కోసం టెండర్ దారులు ఎవరు రాకపోవడంతో వాయిదా వేయడం జరిగిందని,తిరిగి మళ్లీ టెండర్ త్వరలో ప్రకటనను తెలియజేస్తామని అన్నారు. టెండర్ దారులకు ఏప్రిల్ ఒకటి నుంచి అనుమతి పత్రాలు ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ నాగులమ్మ సారలమ్మ జాతర ప్రారంభం

**పినపాక, విశాలభారతి:**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం జానంపేట గ్రామ సమీపంలో వెలసిన శ్రీ నాగులమ్మ సారలమ్మ జాతర గత కొన్ని సంవత్సరాలుగా నిర్వహించడం జరుగుతుంది . తేది 25 03 2025 నుండి 23 03 2025 మంగళవారము ఉ॥ 0835 ని.లకు నాగులమ్మ దేవాలయంలో గణపతి పూజ, పుణ్యాహవాచనం దేవి సన్నిధిలో జాతర ప్రారంభం అవుతుందని అర్చకులు తెలియజేశారు. అమ్మవారికి అభిషేకాలు, మండపారాధన గోపూజ లక్ష్మీగణపతి అగ్నిప్రతిష్ఠ అధిష్టాన దేవతల హోమాలు, తీర్థ గోష్ట, ప్రసాద వితరణ గుడిమెలుకొల్పు రాత్రి 445 నిమిశాలకు జరుపుతారు. 26032025 బుధవారం 1040 ప్రసాద వితరణ జరుగును, శ్రీ నాగదేవతల కలుసు భంద గుట్ట నుండి సా. 645 ని॥లకు గుడికి వచ్చును. 27032025 గురువారం నిండు జాతర మధ్యాహ్నం 145 ని॥లకు గట్టు నుండి వనదేవతలను గుడికి తీసుకొస్తారు. సా॥ 415లకు శ్రీ నాగదేవతల పువ్వంది గంగా స్నానమునకు వెళ్ళి రాత్రి 1130 ని॥లకు తిరిగి వస్తారు అని తెలియజేశారు. శ్రీ నాగదేవత కళ్యాణం రాత్రి 100 గం॥ల నుండి 3 గంటల వరకు బ్రహ్మాండముగా జరుపుతారు. అమ్మవారి కళ్యాణం సందర్భముగా 100 గం॥ల నుండి 3 గంటల వరకు అమ్మవారీ అగ్ని గుండములో భక్తులు నడుస్తారు. 28032025 ఉదయం 600 గం॥ల నుండి సాయంత్రం 600 గం॥ల వరకు మొక్కుబడులు భక్తులు చెల్లించుకుంటారు. 29 032025సాయంత్రం 400 గం॥లకు నాగదేవత గుడి నుండి గుట్టకు తీసుకువెళ్తారు. నాగులమ్మ సారలమ్మల వనదేవతలను భక్తులు దర్శించుకొని కోరిన కోరికలు సంతాన ప్రాప్తి సర్వరోగని వారిని దారిద్య నిర్మూలన అష్టైశ్వర్యాలు కలుగునని భక్తుల నమ్మకం.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
మంగళవారం
25.03.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



## ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఉప్పల



**ఎల్బీనగర్ విశాలభారతి:**

ఎల్బీనగర్ నియోజకవర్గం బండ్లగూడ పరిధిలోని సహబావన టౌన్షిప్ లో కాజామియ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు లో పాల్గొన్న టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతీక రంజాన్ అని ఈ మాసంలో భక్తి శ్రద్ధలతో ఉపవాసాలు వుంటున్న ముస్లిం సోదరులు సంతోషంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు.




## జిహెచ్ ఎంసి కమిషనర్ సంచలన నిర్ణయం

- ఎల్ బి నగర్ జోన్ పరిధిలో ఒకేసారి 15 న్యాక్ ఇంజనీర్లు సస్పెండ్



**ఎల్ బి నగర్ , విశాల భారతి:**

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) కమిషనర్ ఇలంబర్తి సంచలన నిర్ణయం తీసుకున్నారు. జీహెచ్ఎంసీలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న 27 మంది న్యాక్ ఇంజనీర్లను ఉద్యోగాల నుంచి తొలగించారు. ఈ మేరకు ఆదివారం నాడు ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు న్యాక్ ఇంజనీర్లుగా పని చేస్తున్నారు. ఈ క్రమంలో కొందరు న్యాక్ ఇంజనీర్లు అవినీతికి పాల్పడుతున్నట్లు ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. న్యాక్ ఇంజనీర్లపై అవినీతి ఆరోపణలు రావడంతో కమిషనర్ ఇలంబరితి విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. విజిలెన్స్ విచారణలో 27 మంది న్యాక్ ఇంజనీర్లు అవినీతికి పాల్పడ్డట్లు తేలింది. విజిలెన్స్ రిపోర్ట్ ఆధారంగా అవినీతికి పాల్పడ్డ 27 మంది న్యాక్ ఇంజనీర్లను కమిషనర్ ఇలంబర్తి ఉద్యోగాల నుంచి తొలగించారు. ఈ మేరకు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో ఎల్బీ నగర్ జోన్ పరిధిలో ఒకేసారి 15 అవినీతి ఆరోపణలపై ఒకేసారి మందిని ఉద్యోగాల నుంచి తొలగించడం జీహెచ్ఎంసీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# ఆత్మీయ సమ్మేళనం... బంధాలు బలోపేతం

- ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం
- 25 సంవత్సరాల తరువాత ఒకేవేదికను పంచుకున్న పూర్వ విద్యార్థులు



**ఇబ్రహీంపట్నం,విశాలభారతి:**

ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2001 సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసుకున్న "పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం"ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో ఎన్ఆర్ గార్డెన్స్ లో అంగరంగ వైభవంగా నిర్వహించారు. 25 సంవత్సరాల తరువాత అందరూ ఒకచోట ఈ ఆత్మీయ సమ్మేళనం ద్వారా కలుసుకోవడంతో విద్యార్థులందరూ అలనాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఉపాధ్యాయులతో జ్యోతి ప్రజలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులందరూ,ఉపాధ్యాయులను పూలమాలలతో,శాలువాలతో సత్కరించారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు పొగాకు సురేష్ మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం యువత పాటుపడాలని అన్నారు. జీవితంలో ఏ స్థాయిలో ఉన్నా కూడా తల్లిదండ్రులను, గురువులను మర్చిపోవద్దన్నారు. రాష్ట్రంలో ఉత్తమమైన పాఠశాలలగా తమ పాఠశాల నిలవడం చాలా ఆనందంగా ఉందని మన పాఠశాల రాష్ట్రంలో డిజిటల్ తరగతులు, రోబోటిక్ లాప్స్ ఏర్పాటు చేసిన మొదటి పాఠశాలగా మన పాఠశాల నిలిచిందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కొప్పు జంగయ్య, శ్రీనివాస్, సత్యనారాయణ, స్వరూప,రాణి, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## బొంతపల్లి ఆలయం అభివృద్ధి సంపూర్ణ సహకారం

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్ చెరు,విశాలభారతి**

రాష్ట్రంలోనే ప్రముఖ శైవ క్షేత్రంగా పేరొందిన శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి దేవస్థానం అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. దేవస్థానం నవహ్నిక బ్రహ్మోత్సవాలు పురస్కరించుకుని సోమవారం దేవాలయం లో నిర్వహించిన ప్రత్యేక పూజ కార్యక్రమాలలో ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ పాలకవర్గం, దేవస్థానం పురోహితులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారులు ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. గత పది సంవత్సరాల కాలంలో దేవాలయం అభివృద్ధికి తన వంతు సహకారం అందజేశానని గుర్తు చేశారు. భవిష్యత్తులోనూ ఆలయ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని సంభందిత అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి కుమార్ గౌడ్, సీనియర్ నాయకులు విజయ భాస్కర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ ప్రతాపరెడ్డి, ఆలయ ఈవో శశిధర్, షేక్ హుస్సేన్, స్థానిక నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## గీతంలో ఈనెల 27న ప్రతిష్టాత్మక టెడ్ఎక్స్

- హాజరు కానున్న మాజీ మంత్రి పళ్లంరాజు, సౌరబ్ శుక్లా, అటికా, రథిన్ రాయ్, సుబ్బు



**పటాన్ చెరు,విశాలభారతి:**

మరో ప్రతిష్టాత్మక కార్యక్రమం టెడ్ఎక్స్ కి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్ ప్రాంగణం వేదిక కానుంది. గీతం విద్యార్థిని దీక్షితా చెల్లాపిల్ల టెడ్ఎక్స్ గీతం హైదరాబాద్2025 నిర్వహణ కోసం అనుమతి పొందినట్టు స్టూడెంట్ లైఫ్ డైరెక్టరేట్ సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించింది. 'మార్పుకు ఉత్ప్రేరకాలు' ఇతివృత్తంగా నిర్వహిస్తున్న ఈ టెడ్ టాక్స్ లో విభిన్న రంగాలకు చెందిన అత్యంత ప్రభావవంతమైన వ్యక్తులు పాల్గొని, తమ ఆలోచనలను విద్యార్థులతో పంచుకోనున్నట్టు తెలియజేశారు. అనుభవజ్ఞుడైన విధాన రూపకర్తగా పేరొందిన కేంద్ర మానవ వనరుల అభివృద్ధి, రక్షణ శాఖల మాజీ మంత్రి ఎం.ఎం.పళ్లంరాజు ఈ కార్యక్రమంలో పాల్గొని, నాయకత్వం, విద్యా విధానం, పాలనలపై ఆలోచించదగిన దృక్పథాలను పంచుకోనున్నారు. న్యూస్ మొబైల్ వ్యవస్థాపకుడు, ఎడిటర్ఇన్‌చీఫ్, పరిశోధనాత్మక జర్నలిస్టు, గ్లోబల్ ఫ్యాక్ట్‌చెకర్ సౌరబ్ శుక్లా - జర్నలిజం, తప్పుడు సమాచారం, డిజిటల్ మీడియా విప్లవాలు గురించి వివరిస్తారు. ప్రముఖ పాత్రికేయురాలు అటికా అహ్మద్ ఫరూకి - ప్రజల అవగాహనను రూపొందించడం, అర్థవంతమైన మార్పు వైపు నడిపించడంలో మీడియా శక్తిపై చర్చించనున్నారు. ప్రఖ్యాత ఆర్థికవేత్త, భారతదేశ 13వ ఫైనాన్స్ కమిషన్ సలహాదారు డాక్టర్ రథిన్ రాయ్ - ఆర్థిక పరివర్తన, విధాన రూపకల్పన, స్థిరమైన వృద్ధి వ్యూహాలను వివరిస్తారు. ది లెర్నింగ్ కర్వ్ ఫౌండేషన్ సహ వ్యవస్థాపకుడు, ముఖ్య కార్య నిర్వహణాధికారి సుబ్బా పరమేశ్వరన్ విద్య, విద్యార్థుల అభివృద్ధిని మార్చడంలో భావోద్వేగ మేధస్సు యొక్క కీలక పాత్రపై ప్రముఖంగా చర్చించనున్నారు.సినిమా, జర్నలిజం, రాజకీయాలు, క్రీడలు, డిజిటల్ ప్రభావంతో తమ అనుభవాలను పంచుకోనున్న ప్రముఖుల ప్రసంగాలు గీతం టెడ్ఎక్స్ ఆలోచించదగిన అనుభవాన్ని అందించగలదని ఆశిస్తున్నట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఆకర్షణీయమైన సంభాషణలు, శక్తివంతమైన కథలు, భవిష్యత్తును రూపొందించే మార్గదర్శక ఆలోచనలకు బాటలు వేయగలవని వారు అభిలషిస్తున్నారు. ఈ ఉత్సాహభరిత కార్యక్రమంలో పాల్గొని, ఆయా అంశాలపై అవగాహనను ఏర్పరచుకోవాలని విద్యార్థులకు స్టూడెంట్ లైఫ్ డైరెక్టరేట్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.



## ఇందిరమ్మ ఇండ్ల సర్వేను వేగవంతం చేయండి

- గ్రామాలలో, మున్సిపాలిటీల పరిధిలో తాగునీటి కొరత లేకుండా చూడాలి
- రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సీ. నారాయణ రెడ్డి.

**ఇబ్రహీంపట్నం,విశాలభారతి:**

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు ముగిసిన అనంతరం హాస్టల్స్, సంక్షేమ వసతి గృహాలలో ఉండే పిల్లలను జాగ్రత్తగా వారి ఇండ్లకు పంపించే విధంగా చర్యలు చేపట్టాలని జిల్లా విద్యాశాఖ మరియు జిల్లా ఇంటర్మీడియట్ అధికారులకు సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వేను వేగవంతం చేయాలని పిడి హౌసింగ్ కు తెలిపారు. గ్రామాలలో, మున్సిపాలిటీల పరిధిలో తాగునీటి కొరత ఏర్పడకుండా చూడాలని డీపీఓకు, మున్సిపల్ కమిషనర్లకు, మిషన్ భగీరథ అధికారికి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహశీల్దారులు,కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**నాచారం,విశాలభారతి:**

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మహిళ దినోత్సవ వేడుకల్లో భాగంగా మల్లాపూర్ డివిజన్ పరిధిలోని అశోక్ నగర్ కమ్యూనిటీ హాల్ వద్ద జరిగిన కార్యక్రమంలో స్థానిక మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు సమాజానికి మూలస్తంభాలు. వారు కుటుంబాన్ని, సమాజాన్ని, దేశాన్ని ముందుకు నడిపించే శక్తివంతమైన వ్యక్తులు. వారి కృషి, త్యాగం, అభిప్రాయ స్వాతంత్ర్యం మన అందరికీ ప్రేరణ. ప్రతి మహిళకు గౌరవం, సమానత్వం, ప్రోత్సాహం అందించేందుకు మన మందరం కృషి చేద్దామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు,మహిళ సోదరీమణులు తదితరులు పాల్గొన్నారు.



## డిలిమిటేషన్ ను 25 ఏళ్ళు వాయిదా వేయాలి

- దేశానికి రెండవ రాజధానిగా హైదరాబాద్ చేయాలి
- దక్షిణాది జేఏసీ చైర్మన్ ప్రొ. గాలి వినోద్ కుమార్

**విశాలభారతి,ఓయూ:**

దక్షిణాది రాజకీయ అస్థిత్వాన్ని దెబ్బతీస్తున్న డిలిమిటేషన్ ను గత ప్రభుత్వాలు 25 ఏళ్ళు వాయిదా వేయాలని, దేశానికి రెండవ రాజధానిగా హైదరాబాద్ ను వెంటనే ప్రకటించాలని దక్షిణాది జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ గాలి వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ఓయూ న్యాయ కళాశాలలో ఆవరణలోని డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు వేల్పుల సంజయ్ ఇతర విద్యార్థి సంఘాల నాయకుల తో కలిసి పూలమాల సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. 1955 లోనే డాక్టర్ అంబేద్కర్ హైదరాబాద్ అన్ని రకాలుగా ఢిల్లీ కంటే మెరుగైన నగరమే కాకుండా శత్రు దేశాలకు దూరంలో ఉందని రక్షణ, వారవరణం పరంగా మెరుగైన ప్రపంచ నగరం హైదరాబాద్ అని కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి బండి సంజయ్లుకు దమ్మంటే ఉత్తరాది పీఎం హోం మినిస్టర్లను ఒప్పించి హైదరాబాద్ ను దేశానికి రెండవ రాజధాని చేయాలని అయన డిమాండ్ చేశారు. ఓయూలో ఇటివలే జారీ చేసిన నియంత సర్కులర్ ను వాపస్ తీసుకొని రాజ్యాంగం విద్యార్థులకు కల్పించిన వాక్ స్వతంత్రాన్ని కాపాడలని ప్రొ. గాలి వినోద్ కుమార్ వేల్పుల సంజయ్ డిమాండ్ చేశారు.కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.



## మహనీయులను అవమానిస్తున్న కేంద్ర ప్రభుత్వం

**బాల్కొండ,విశాలభరతి**

స్వాతంత్ర సమరయోధులను అవమానిస్తూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని అవమానించేలా కేంద్రంలోని బీజేపీ సర్కార్ ప్రవర్తిస్తుందని శాసనమండలి సభ్యుడు బల్మూర్ వెంకట్ అన్నారు. సోమవారం భీమ్‌గల్ పట్టణ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆద్వర్యంలో జై బాపు,జై భీమ్,జై సంవిధాన్ కార్యక్రమానికి రాష్ట్ర మినరల్ డెవలప్మెంట్ కార్పరేషన్ ఛైర్మన్ ఈరవత్రి అనిల్,జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాష్ట్ర సహకార సంఘం చైర్మన్ మానాల మోహన్ రెడ్డి,బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ముత్యాల సునీల్ కుమార్ తో కలిసి ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అహింస పద్ధతిలో పోరాటం చేస్తూ ప్రపంచానికి ఆదర్శంగా నిలిచి ఈ దేశానికి స్వాతంత్రం సిద్ధింపజేసిన మహాత్మా గాంధీతో పాటు ప్రజల స్వేచ్ఛ సమానత్వం కోసం రాజ్యాంగాన్ని రచించిన అంబేద్కర్ లను బీజేపీ , ఆర్ఎస్ఎస్ అవమానపరుస్తున్నాయని మండిపడ్డారు.పార్లమెంట్ సాక్షిగా కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అంబేద్కర్ కు వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనమన్నారు.మహనీయుల ఆశయాలను కాపాడడంతోపాటు ప్రజలకు స్వేచ్ఛను ప్రసాదించిన రాజ్యాంగాన్ని పరిరక్షించడానికి కాంగ్రెస్ పార్టీ అగ్రనేత లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా జై బాపు,జై భీమ్,జై సంవిధాన్ అభియాన్ ర్యాలీ నిర్వహిస్తున్నారని తెలిపారు. రాజ్యాంగ విలువలను కాపాడడానికి ప్రజల హక్కులను పరిరక్షించడానికి దేశవ్యాప్తంగా అన్ని పట్టణాలు గ్రామాలలో సామాజిక న్యాయం,ఐక్యత కల్పించే ప్రధాన ఉద్దేశ్యంతో సంవిధాన్ బచావో రాష్ట్రీయ పాదయాత్ర చేయాలని ఏఐసీసీ నిర్ణయించిందన్నారు. గ్రామ గ్రామాన ఈ పాదయాత్ర చేయాలి అని సమావేశంలో పిలుపు నిచ్చారు.ఈ పాదయాత్ర ద్వారా రాజ్యాంగ గొప్పతనాన్ని ప్రజలకు తెలియజేయడంతో పాటు మహనీయులను స్మరించేందుకు వారు చేసిన సేవలను నేటి తరానికి తెలియపరిచే ఉద్దేశంతో ఈ బృహత్తర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు.ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్త బీజేపీ పార్టీ చేస్తున్న అరాచక పాలనను రాజ్యాంగ వ్యతిరేక చర్యలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బోధిరే స్వామి, డిసిసి డెలిగేట్ కుంట రమేష్,పట్టణ అధ్యక్షుడు జే జే నర్సయ్య,ఎస్సి సెల్ అధ్యక్షులు పర్స అనంత రావు,ఎస్టి సెల్ అధ్యక్షుడు గోపాల్ నాయక్,బీసీ సెల్ అధ్యక్షుడు కోరాడి రాజు,జిల్లా యూత్ ఉపాధ్యక్షుడు నాగేంద్రబాబు, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు చరణ్ గౌడ్,మల్లెల లక్షణ్, తదితరులు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
సినిమా
మంగళవారం
25.03.2025
హైదరాబాద్




cinema updates

బాలీవుడ్‌లో ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారిన యాక్షన్ మూవీ 'జాట్' లో ఒక్కొక్కటిగా ఇంట్రెస్టింగ్ అప్డేట్స్ బైటకు వస్తున్నాయి. సన్నీ డియోల్ హీరోగా గోపీచంద్ మలినేని డైరెక్షన్‌లో తెరకెక్కుతున్న ఈ మూవీకి ఇప్పటికే భారీ క్రేజ్ ఏర్పడింది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు థమన్ సంగీతం అందిస్తున్నారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన మరో అప్‌డేట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.ఈ చిత్రంలో క్రేజీ విలన్‌గా రణ్‌దీప్ హుడా లుక్‌కి మంచి రెస్పాన్స్ రావడంతో పాటు, ఇటీవల విడుదలైన ట్రైలర్ కూడా ట్రెండింగ్ లో నిలిచింది. సయామీ ఖేర్, రెజీనా కసాండ్రా, వినీత్ కుమార్ వంటి నటులు కీలక పాత్రలు పోషిస్తుండగా.. బాక్సాఫీస్ వద్ద సన్నీ డియోల్ కి ఇది ఓ మాస్ రీ ఎంట్రీ అవుతుందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. ఇక తాజా అప్‌డేట్ ప్రకారం టాలీవుడ్ ఇస్మార్ట్ బ్యూటీ నభా నటేష్ ఈ సినిమాలో ఓ స్పెషల్ ఐటెమ్ సాంగ్‌లో నటించబోతున్నట్లు సమాచారం. ఈ మేరకు చిత్ర బృందం ఒక స్పెషల్ మాస్ నెంబర్ రూపొందించిందట. బాలీవుడ్ స్టార్ హీరో మూవీగా పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో నభా కనిపించడం ఆమె కెరీర్‌కి కొత్త దిశగా మారవచ్చునన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇస్మార్ట్ శంకర్ అనంతరం ఆమెకు సరైన సక్సెస్ రాలేదు. దీంతో ఈ స్పెషల్ సాంగ్ ద్వారా అటు బాలీవుడ్‌లో, ఇటు సౌత్‌లో తిరిగి ఫోకస్ లోకి వచ్చేందుకు ఇది బెస్ట్ ఛాన్స్ కావొచ్చని సినీ విశ్లేషకులు చెబుతున్నారు. కరోనా తర్వాత ఒకసారి రోడ్డు ప్రమాదానికి గురై సినిమాల నుంచి బ్రేక్ తీసుకున్న నభా, ఇటీవలే 'డార్లింగ్' సినిమాతో రీ ఎంట్రీ ఇచ్చింది. అయితే ఆ సినిమా పెద్దగా ఆకట్టుకోలేకపోయింది. దీంతో మరోసారి గ్లామర్‌కు ప్రాధాన్యత ఇచ్చే పాత్రలవైపు ఆమె ఫోకస్ పెంచింది. ఇప్పుడు జాట్ మూవీ ఐటెమ్ సాంగ్‌తో వచ్చిన ఈ అవకాశాన్ని నభా ఎంతవరకు వినియోగించుకుంటుందనేదే ఆసక్తికరంగా మారింది. ఈ సినిమాను ఏప్రిల్ 10న భారీ స్థాయిలో రిలీజ్ చేయనున్నారు. మాస్ యాక్షన్, హారర్ థ్రిల్ మిక్స్‌తో వస్తున్న ఈ సినిమాలో అన్ని కమర్షియల్ అంశాలూ బలంగా ఉన్నట్లు ఇప్పటికే విడుదలైన కంటెంట్ ఆధారంగా తెలుస్తోంది. నభా నటేష్ స్పెషల్ సాంగ్ కూడా సినిమాకి హైలైట్ అవుతుందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. మరి ఈ పాటతో నభాకు మళ్లీ క్రేజ్ వస్తుందా.. లేదంటే మరో గ్లామర్ గెస్ట్ గా మిగిలిపోతుందా అన్నది రిజల్ట్ తర్వాత తేలనుంది.

# బాలీవుడ్‌లో ఇస్మార్ట్ పాప





# మాస్ రాజా మడత

మాస్ రాజా రవితేజ కథానాయకుడిగా భాను భోగవరపు దర్శకత్వంలో 'మాస్ జాతర' తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే రిలీజ్ అయిన ప్రచార చిత్రాలతో మరోసారి మాస్ కంటెంట్ తోనే రాజా రాబోతున్నట్లు తేలిపోయింది. ఇందులో రవితేజకు జోడీగా శ్రీలీల నటిస్తుంది. ఇద్దరి కాంబినేషన్ 'ధమాకా'లా బాగా వర్కౌట్ అవ్వడంతో? ఇందులోనూ అదే రిపీట్ అవుతుందని అభిమానులు ఆశిస్తున్నారు.ఆ సక్సెస్ కి సెంటిమెంట్ గానే శ్రీలీలను తెరపైకి తెచ్చారు. సినిమాలో కొన్ని రవితేజ పాత పాటలు కూడా రీమిక్స్ చేస్తున్నారు. మాస్ రాజా ఇమేజ్ కిది బాగా కలిసొచ్చేదే. మ్యూజికల్ గా మంచి ఫాంలో ఉన్న భీమ్స్ ఆ బాధ్యతలు తీసుకోవడంతో మాస్ ఆడియన్స్ లోకి సినిమా బలంగా వెళ్తుందని టీమ్ భావిస్తోంది. తాజాగా ఈ సినిమాకి సంబంధించి ఓ ఇంట్రెస్టింగ్ అప్ టేడ్ వచ్చింది. ప్రధమార్ధంలో వచ్చే ఓ యాక్షన్ సన్నివేశాన్ని వెంకట్ మాస్టర్ కంపోజ్ చేసినట్లు తెలుస్తోంది. సినిమాలో రవితేజ ఆర్పీఎఫ్ పోలీస్ పాత్ర పోషిస్తున్నాడు. యూనిఫాంలోనే ప్రత్యర్థుల్ని పరిగెట్టించే ఫైట్ ఇది. దానికి సంబం ధించిన కొత్త పోస్టర్ ఒకటి వైరల్ అవుతుంది. మాస్ రాజా ఫైట్ లో కాస్త యాక్షన్ కూడా మేళవిం చడం పరిపాటే. ఇందులో రవితేజ పాత్ర కామిక్ గానూ ఉంటుందని ఇప్పటికే లీకులందుతున్నాయి. రవితేజ మాస్ కి కనెక్ట్ అవ్వడానికి అలాంటి సన్నివేశాలే కీలకం. ఈ నేపథ్యంలో మాస్ జాతర వాటికి ఏమాత్రం కొదవ లేనట్లే తెలుస్తోంది. రవితేజకు ఇదొక ల్యాండ్ మార్క్ చిత్రం కావడం విశేషం. ఆయన నటిస్తోన్న 75వ చిత్రమిది. దీంతో ఈ సినిమా మంచి విజయం సాధించి కెరీర్ లో నిలిచిపోవాలని అభిమా నులు ఆశిస్తున్నారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.